# ఛత్తీస్‌గఢ్ సీఎంగా విష్ణుదేవ్

## ఆదివాసీ నేతను ఎంపిక చేసిన బీజేపీ అధిష్ఠానం

### శాసనసభాపక్ష నేతగా ఎన్నుకొన్న పార్టీ ఎమ్మెల్యేలు

### అజిత్ జోగి తర్వాత రాష్ట్ర సీఎంగా మరో ఆదివాసీ నేత



ఛత్తీస్‌గఢ్ సీఎంగా ఎంపికైన విష్ణుదేవ్ సాయ్‌ని పూల దండలతో సత్కరిస్తున్న బీజేపీ నేతలు

రాయ్‌పూర్, డిసెంబర్ 10: ఛత్తీస్‌గఢ్ కొత్త సీఎం ఎవరనే దానిపై వారం రోజులుగా కొనసాగుతున్న సస్పెన్స్‌కు తెరపడింది. రాష్ట్రానికి నూతన సీఎంగా కేంద్ర మాజీ మంత్రి, ప్రముఖ ఆదివాసీ నేత విష్ణుదేవ్ సాయ్‌ని బీజేపీ ఎంపిక చేసింది. రాయ్‌పూర్‌లోని రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం సమావేశమైన 54 మంది బీజేపీ ఎమ్మెల్యేలు ఆయన్ను పార్టీ శాసనసభా పక్ష నేతగా ఎన్నుకొన్నారు. ఈ సమావేశానికి ఢిల్లీ నుంచి పార్టీ పరిశీలకులుగా కేంద్ర మంత్రులు అర్జున్ ముండా, సర్బానంద సోనోవాల్, బీజేపీ ప్రధాన కార్యదర్శి దుష్యంత్ కుమార్ గౌతమ్ వచ్చారు. విష్ణుదేవ్ సాయ్ గతంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సుర్జుగా డివిజన్‌లోని జాష్పూర్ జిల్లా కుంకురి స్థానం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. శాసనసభా పక్ష నేతగా ఎన్నిక కావడంపై విష్ణుదేవ్ ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేల సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో సీఎంగా అవకాశం ఇచ్చినందుకు ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, పార్టీ ఇతర నేతలకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నికల సమయంలో తమ పార్టీ ఇచ్చిన 'మోదీ గ్యారంటీల'ను అమలు చేసేందుకు ప్రయత్నిస్తానని అన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం హౌసింగ్ స్కీమ్ కింద అర్హులైన లబ్ధిదారులకు 18 లక్షల ఇండ్లను మంజూరు చేయడమే తమ ప్రభుత్వం మొదటి పని అని చెప్పారు. ఇటీవలి ఎన్నికల్లో 90 స్థానాలకు గానూ బీజేపీ 54 సీట్లలో జయకేతనం ఎగురవేసిన విషయం తెలిసిందే. 2018 ఎన్నికల్లో 68 సీట్లతో అధికారం చేపట్టిన కాంగ్రెస్.. ఈ సారి కేవలం 35 స్థానాలకు పరిమితమైంది.

**సుదీర్ఘ చర్చల అనంతరం ప్రకటన**

2000లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎంగా బాధ్యతలు నిర్వహించిన అజిత్ జోగీ(2000-03) తొలి ఆదివాసీ సీఎం కాగా.. ఇప్పుడు సుదీర్ఘకాలం తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రిగా మరో ఆదివాసీకి అవకాశం లభించింది. సీఎంగా ఓబీసీ లేదా అదివాసీ వర్గానికి చెందిన వారిని నియమించే అంశంపై బీజేపీ గత వారం రోజులుగా సుదీర్ఘ చర్చలు జరిపింది. ఈ క్రమంలో ఓబీసీ వర్గం నుంచి అరుణ్ సావో, ఓపీ చౌదరి వంటి పేర్లు వినిపించగా.. ఆదివాసీ కోటాలో విష్ణుదేవ్, రేణుకా సింగ్, రాంవిచార్ నేతమ్ పేర్లు వినిపించాయి. విష్ణుదేవ్ మాజీ సీఎం రమణ్ సింగ్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్నది. రాష్ట్రంలో ఓబీసీల తర్వాత 32 శాతం ఉన్న ఆదివాసీలే అధిక జనాభా కావడం గమనార్హం. ఈ కారణంగానే రాష్ట్ర కొత్త సీఎంగా బీజేపీ విష్ణుదేవ్ వైపు మొగ్గుచూపినట్టు తెలుస్తున్నది.

### సర్పంచ్ స్థాయి నుంచి అంచెలంచెలుగా..

విష్ణుదేవ్ రాష్ట్ర బీజేపీలో ప్రముఖ ఆదివాసీ నేతగా ఉన్నారు. ఆదివాసీ కమ్యూనిటీలో ఈయనకు మంచి పేరున్నది. గతంలో మూడు పర్యాయాలు(చివరిసారిగా 2020-2022 వరకు) రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. విష్ణుదేవ్ గ్రామ సర్పంచ్‌గా తన రాజకీయ జీవితం ప్రారంభించారు. ఆ తర్వాత కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగారు. 2014లో ప్రధాని మోదీ తొలి క్యాబినెట్‌లో గనుల శాఖ సహాయ మంత్రిగా సేవలందించారు. 1990లో తొలిసారి అవిభాజ్య మధ్యప్రదేశ్‌లోని తప్కారా స్థానం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రాయగఢ్ నుంచి వరుసగా నాలుగుసార్లు (1999,2004,09,14) లోక్‌సభ ఎంపీగా ఎన్నికైన విష్ణుదేవ్.. పార్టీలో పలు కీలక పదవులు నిర్వర్తించారు. విష్ణుదేవ్‌ది రాజకీయ కుటుంబం. ఆయన కుటుంబసభ్యులు పలువురు గతంలో ఎమ్మెల్యేలు, ఎంపీలుగా పనిచేశారు.

## నేడు మధ్యప్రదేశ్ సీఎం ఎంపిక?

- శాసనసభా పక్ష నేతను ఎన్నుకోనున్న ఎమ్మెల్యేలు
- రాజస్థాన్‌లో తెరపడని సస్పెన్స్

భోపాల్/జైపూర్, డిసెంబర్ 10: మధ్యప్రదేశ్‌కు కొత్త ముఖ్యమంత్రి ఎవరో సోమవారం తెలిసిపోనున్నది. ఈ మేరకు కొత్తగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యేలు సమావేశమై పార్టీ శాసన సభా పక్ష నేతను ఎన్నుకోనున్నారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, సీఎం అభ్యర్థి పేరును 7 గంటలకు ప్రకటిస్తారని ఎమ్మెల్యే ఒకరు వెల్లడించారు. ఈ సమావేశానికి కేంద్ర బీజేపీ పరిశీలకులుగా హర్యానా సీఎం ఖట్టర్, ఓబీసీ మోర్చా నేత కే లక్ష్మణ్, పార్టీ కార్యదర్శి అశా లక్రా హాజరు కానున్నట్టు తెలుస్తున్నది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 230 స్థానాలకు గానూ 163 సీట్లలో విజయం సాధించింది. అయితే ఎన్నికల ప్రచార సమయంలో సీఎం అభ్యర్థిగా ఆ పార్టీ ఎవరినీ ప్రకటించలేదు. సీఎం రేసులో ప్రస్తుత సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్‌తోపాటు సీనియర్ నేతలు జ్యోతిరాదిత్య సింధియా, ప్రహ్లాద్‌పటేల్, నరేంద్రసింగ్ తోమర్, కైలాశ్ విజయవర్గీయ, వీడీ శర్మ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

**వసుంధర రాజేతో 10 మంది ఎమ్మెల్యేల భేటీ**

మరోవైపు రాజస్థాన్‌లోనూ కొత్త ముఖ్యమంత్రిపై సస్పెన్స్ కొనసాగుతున్నది. శాసనసభా పక్ష నేతను ఎన్నుకొనేందుకు ఎమ్మెల్యేల సమావేశం ఎప్పుడనే దానిపై బీజేపీ ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో కొత్తగా ఎన్నికైన దాదాపు 10 మంది బీజేపీ ఎమ్మెల్యేలు ఆదివారం మాజీ సీఎం వసుంధర రాజేను ఆమె నివాసంలో కలవడం ప్రాధాన్యం సంతరించుకొన్నది. అంతకుముందు ఫలితాల వెల్లడి తర్వాత కూడా పలువురు ఎమ్మెల్యేలు రాజేను కలిశారు. రాష్ట్ర సీఎం పదవిని మరోసారి చేపట్టేందుకు వసుంధర రాజే గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఇందులో భాగంగానే పార్టీ అధినాయకత్వానికి సంకేతం ఇచ్చేలా ఆమె ఎమ్మెల్యేలతో సమావేశం పేరుతో బల ప్రదర్శన చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.



అయోధ్య రామమందిరంలో కొనసాగుతున్న నిర్మాణ పనులు

## నిజం కానున్న కోట్లాది హిందువుల కల

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): అయోధ్య రామమందిరంలో వచ్చే నెల శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ప్రతిష్ఠాపనతో కోట్లాది హిందువుల కల నిజం కాబోతున్నదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. అయోధ్యలో నిర్మిస్తున్న రామమందిరంలో రాములవారిని ప్రతిష్ఠించే గర్భగుడి ఫొటోలను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ విడుదల చేసిన నేపథ్యంలో ఆదివారం ఆమె ట్వీట్ చేశారు. 'అయోధ్యలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ప్రతిష్ఠాపనతో కోట్లాది హిందువుల కల నిజం కాబోతున్న శుభసమయంలో తెలంగాణతో పాటు దేశ ప్రజలందరూ స్వాగతించాల్సిన శుభ ఘడియలు' అని ఆమె ట్వీట్ చేశారు. అయోధ్యలో రామాలయ నిర్మాణం జరగాలన్న హిందువుల ఆకాంక్ష త్వరలో నెరవేరుతుండటం సంతోషకరమన్నారు. రామాలయాన్ని సందర్శించడానికి ఎంతో మంది ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

## శబరిమల దర్శన వేళలు పొడిగింపు

తిరువనంతపురం: కేరళలోని శబరిమలకు భక్తుల తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో అయ్యప్ప దర్శనం వేళలు గంట పొడిగిస్తూ ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) ఆదివారం నిర్ణయం తీసుకుంది. సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు ఉన్న దర్శన వేళలను గంట పెంచింది. మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 11 గంటల వరకు భక్తులకు దర్శన అవకాశం కల్పించాలని అధికారులు నిర్ణయించారు. అంతేకాకుండా దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న వారికి మంచినీరు, బిస్కెట్లు అందజేస్తామని చెప్పారు.

**క్యూలో తోపులాట.. బాలిక మృతి**

శబరిమల కొండపై చోటుచేసుకున్న తొక్కిసలాటలో 11 ఏండ్ల బాలిక మృతి చెందింది. అయ్యప్ప దర్శనానికి శుక్రవారం సాయంత్రం నుంచి వేలాది మంది భక్తులు రావడం ప్రారంభించారు. క్యూలైన్లన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. దీంతో తోపులాట చోటుచేసుకుంది. లైన్‌లో దర్శనం కోసం వేచి చూస్తున్న 11 ఏండ్ల బాలిక స్పృహతప్పి పడిపోవడంతో ఆమెను పంపా దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మరణించింది. తమిళనాడులోని సేలంకు చెందిన ఆ బాలిక మూడేండ్ల వయసు నుంచి హృద్రోగ సంబంధ వ్యాధితో బాధపడుతున్నట్టు బంధువులు తెలిపారు.

## ఇఫ్తార్ విందుకు యునెస్కో గుర్తింపు

న్యూఢిల్లీ: రంజాన్ మాసంలో ముస్లింలు ఇచ్చే ఇఫ్తార్ విందుకు యునెస్కో (ఐక్య రాజ్యసమితి విద్య, శాస్త్రీయ, సాంస్కృతిక సంస్థ) గుర్తింపు లభించింది. ఇరాన్, టర్కీ, అజర్‌బైజాన్, ఉజ్బెకిస్థాన్ సంయుక్తంగా చేసిన ప్రతిపాదనను ఆమోదించింది. ఉపవాసం తర్వాత సాయంత్రం వేళలో ఇచ్చే ఈ విందు వల్ల కుటుంబం, కమ్యూనిటీ సంబంధాలు బలోపేతమవుతాయని, దాతృత్వం, సంఘీభావం, సాంఘిక మార్పిడిని ప్రోత్సహిస్తుందని తెలిపింది. ఉపవాసం వల్ల కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులు తమ పిల్లలకు వివరిస్తారని, సాంఘిక విలువలు పెంపొందుతాయని వివరించింది.

## స్పీకర్‌గా రమణ్ సింగ్?

రమణ్ సింగ్

**విష్ణుదేవ్‌కు ఇద్దరు డిప్యూటీలు!**

భోపాల్, డిసెంబర్ 10: ఛత్తీస్‌గఢ్ కొత్త సీఎంగా ఆదివాసీ నేత విష్ణుదేవ్ సాయ్‌ని ఎంపిక చేసిన బీజేపీ అధిష్ఠానం.. ఇప్పుడు మిగతా సీనియర్లను సంతృప్తి పరిచేలా మిగతా పోస్టుల విషయంలో కుల సమీకరణాలను పరిగణనలోకి తీసుకొనే యోచనలో ఉన్నట్టు తెలుస్తున్నది. ఇందులో భాగంగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న అరుణ్ సావో(ఓబీసీ నేత), విజయ్ శర్మ(బ్రాహ్మణ్)లకు డిప్యూటీ సీఎంలుగా అవకాశం కల్పించన్నుట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. అదేవిధంగా సీఎం పోస్టు కోసం తీవ్రంగా ప్రయత్నించిన రాజ్‌పుత్ వర్గానికి చెందిన సీనియర్ నేత, మాజీ సీఎం రమణ్ సింగ్‌ను అసెంబ్లీ నూతన స్పీకర్‌గా చేసే అవకాశం ఉన్నదని తెలిపాయి.

## 19న 'ఇండియా' కూటమి సమావేశం

### సీట్ల సర్దుబాటు, ఎన్నికల వైఫల్యాలపై చర్చించే అవకాశం

న్యూఢిల్లీ, డిసెంబర్ 10: కేంద్రంలో నరేంద్ర మోదీని గద్దె దించే ప్రధాన లక్ష్యంతో కాంగ్రెస్, ఇతర విపక్ష పార్టీలతో ఏర్పడిన ఇండియా కూటమి తదుపరి సమావేశం ఈనెల 19న దేశ రాజధాని ఢిల్లీలో జరుగనుంది. ఇండియా కూటమి నాలుగో సమావేశం ఈ నెల 19, మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఢిల్లీలో జరుగుతుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్‌లో వెల్లడించారు. ప్రధాని మోదీని ఎదుర్కొనేందుకు ఐకమత్యమే ప్రధాన ఇతి వృత్తంగా 'నేను కాదు.. మేము' థీమ్‌తో పార్టీలు ముందుకు సాగుతాయని ఆయన చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని సమర్థంగా ఎదుర్కోవడానికి ప్రత్యామ్నాయ వాస్తవిక అజెండాతో ముందుకు రావడం ఇప్పుడు విపక్షాల ముందున్న సవాలని ఆయన పేర్కొన్నారు. కాగా, ఈ సమావేశంలో వచ్చే ఎన్నికల్లో కూటమిలోని పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు, సంయుక్తంగా బహిరంగ సమావేశాల ఏర్పాటు, ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర ఓటమి తదితర అంశాలను చర్చించనున్నట్టు తెలిసింది.

## మారిటల్ రేప్ నేరం కాదు!

ప్రయాగరాజ్: భార్యకు ఇష్టంలేని శృంగారం (మారిటల్ రేప్) నేరం కాదని ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు చెప్పింది. భార్యకు 18 ఏండ్లు నిండితే వైవాహిక అత్యాచారాన్ని భారత శిక్షా స్మృతి ప్రకారం నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. పెళ్లయ్యాక తనకు ఇష్టం లేకున్నా భర్త కలిసేందుకు ప్రయత్నించాడని, తనను హింసించాడని ఓ భార్య వేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన కోర్టు, ఈ మేరకు తీర్పు వెలువరించింది. భర్తను నిర్దోషిగా తేలుస్తూ జస్టిస్ రామ్‌మనోహర్ నారాయణ మిశ్రా తీర్పు చెప్పారు.

## బైడెన్‌కు ఎదురుగాలి.. ట్రంప్ ముందంజ!

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు ఎదురుగాలి వీస్తున్నది. 2024 అధ్యక్ష ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పైచేయి సాధిస్తారని తాజా సర్వే అంచనా వేసింది. వాల్ స్ట్రీట్ జర్నల్ నిర్వహించిన పోల్‌లో బైడెన్‌కు అతి తక్కువ అప్రూవల్ రేటింగ్ వచ్చింది. ఇటీవల నిర్వహించిన చాలా సర్వేలు కూడా ఇదే విషయాన్ని వెల్లడించడంతో డెమొక్రటిక్ పార్టీ ఆందోళన చెందుతున్నది. ఓటింగ్‌కు ఏడాది కన్నా తక్కువ సమయమే ఉండటం వీరిని మరింత ఒత్తిడికి గురి చేస్తున్నది. బైడెన్ కన్నా ట్రంప్ నాలుగు పాయింట్ల ఆధిక్యంలో ఉన్నట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ తాజా సర్వే వెల్లడించింది.

## కర్ణాటక ప్రభుత్వం ఎప్పుడైనా కూలొచ్చు!

- కేసుల నుంచి తప్పించుకునేందుకు ఓ కీలక మంత్రి ప్రయత్నాలు
- 50-60 మంది ఎమ్మెల్యేలతో కలిసి బీజేపీలో చేరే అవకాశం
- మాజీ సీఎం, జేడీఎస్ నేత కుమారస్వామి వ్యాఖ్యలు

బెంగళూరు: కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, జేడీఎస్ నేత కుమారస్వామి సంచలన వ్యాఖ్యలు చేశారు. కర్ణాటక కాంగ్రెస్ సర్కారు ఎప్పుడైనా కూలొచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వంలో అత్యంత కీలకమైన మంత్రి ఒకరు కేసులతో సతమతం అవుతున్నారని, ఈ నేపథ్యంలో ఆయన దాదాపు 50 నుంచి 60 మంది ఎమ్మెల్యేలతో కలిసి బీజేపీలో చేరే అవకాశం ఉన్నదని చెప్పారు. ఈ మేరకు ఆ మంత్రి బీజేపీ అధిష్ఠానంతో చర్చలు జరుపుతున్నట్టు పేర్కొన్నారు. ఆదివారం కుమారస్వామి మీడియాతో మాట్లాడారు. 'కర్ణాటక కాంగ్రెస్‌లో అంతా సవ్యంగా లేదు. ప్రభుత్వం ఎప్పుడైనా పడిపోవచ్చు. కేసుల నుంచి బయటపడేందుకు కీలక మంత్రి సతమతం అవుతున్నాడు. ఆయన తప్పించుకునేందుకు వీలు లేకుండా కేంద్ర దర్యాప్తు సంస్థలు ఆయనపై ఉచ్చు బిగించాయి' అని ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్రలో జరిగినట్లుగానే కర్ణాటకలో కూడా ఏ క్షణంలోనైనా ఏమైనా జరగవచ్చునని చెప్పారు. రాజకీయ నేతలు తమ సౌకర్యం కోసం పార్టీలు మారుతారని, సిద్ధాంతాలను పక్కన పెడతారని అన్నారు.

## మేనల్లుడే వారసుడు

**మాట తప్పిన మాయావతి**

**బీఎస్పీ తదుపరి అధినేతగా ఆకాశ్ ఆనంద్**

న్యూఢిల్లీ, డిసెంబర్ 10: బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి మాట తప్పారు. తన కుటుంబ సభ్యులెవరినీ తన రాజకీయ వారసులుగా ప్రకటించనని 15 ఏండ్ల క్రితం తన ఆత్మకథలో పేర్కొన్న ఆమె.. తాజాగా తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్(28)ను తన రాజకీయ వారసుడిగా ప్రకటించారు. ఆదివారం లక్నోలో జరిగిన పార్టీ సమావేశంలో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సమావేశంలో లోక్‌సభ ఎన్నికల సన్నద్ధత కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఆకాశ్ ఆనంద్ మాయావతి తమ్ముడు ఆనంద్ కుమార్ కొడుకు. బీఎస్పీలో మాయావతి తర్వాత రెండో స్థానం ఆనంద్ కుమార్‌దే. ఆయన 2019లో పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. అదే ఏడాది ఆకాశ్‌ను పార్టీ జాతీయ సమన్వయకర్తగా నియమించారు. అయితే మాయావతి యూపీ, ఉత్తరాఖండ్‌లో పార్టీని ముందుకు నడిపిస్తారని, ఆనంద్ ఇతర రాష్ట్రాల బాధ్యతలు నిర్వర్తిస్తారని బీఎస్పీ నాయకుడు ఉదయ్‌వీర్ సింగ్ వెల్లడించారు.

అమెరికాలోని టెన్నెసీలో టోర్నడో ధాటికి కూలిన ఓ భవనం.. శిథిలాల కింద ఇరుక్కుపోయిన కారు

## టెన్నెసీని వణికించిన తుఫానులు

### ఆరుగురు మృతి.. 24 మందికి గాయాలు • వేల ఇండ్లకు నిలిచిన విద్యుత్తు సరఫరా

నాష్‌విల్లే (యూఎస్), డిసెంబర్ 10: అమెరికాలోని సెంట్రల్ టెన్నెసీ రాష్ట్రాన్ని శనివారం తీవ్ర తుఫానులు వణికించాయి. తుఫాన్ల తాకిడికి ఆరుగురు మరణించగా, 24 మంది దవాఖాన పాలయ్యారు. తుఫాను ధాటికి పలు ఇండ్లు, వాణిజ్య సంస్థలకు తీవ్ర నష్టం వాటిల్లింది. సుమారు 85 వేల మంది పౌరులు అంధకారంలో చిక్కుకున్నారు. మౌంట్‌గోమెరీ కౌంటీని తీవ్రమైన టోర్నడో చుట్టుముట్టడంతో దాని తాకిడికి ఒక చిన్నారి సహా ముగ్గురు మరణించారని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మౌంట్‌గోమెరీలో ఒక తుఫాను సహాయ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కెంటకీని కూడా సుడిగాలి తాకింది. నాష్‌విల్లేలో ముగ్గురు మరణించారని, మౌంట్‌గోమెరీ కౌంటీలో 23 మంది గాయాలతో చికిత్స పొందుతున్నారని అధికారులు చెప్పారు.

**అమెరికాలో కాల్పులు.. ముగ్గురి మృతి**

అమెరికాలో మరోసారి కాల్పుల మోత మోగింది. జార్జియా రాజధాని అట్లాంటాలో చోటుచేసుకున్న కాల్పుల్లో ముగ్గురు మరణించారు. ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మృతులందరూ 20 ఏండ్ల లోపు వారేనని, డ్రగ్స్ వ్యవహారమే కాల్పులకు కారణమై ఉండొచ్చని పోలీసులు తెలిపారు.

## ట్రక్కుల్లో ఏసీ క్యాబిన్ తప్పనిసరి

**2025 అక్టోబర్ 1 నుంచి అమలు**

**కేంద్రప్రభుత్వం నోటిఫికేషన్**

న్యూఢిల్లీ, డిసెంబర్ 10: ట్రక్కుల్లో ఏసీ క్యాబిన్ తప్పనిసరి చేస్తూ కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. 2025 అక్టోబరు 1 నుంచి ట్రక్కు తయారీ కంపెనీలన్నీ దీనిని విధిగా పాటించాలని, డ్రైవర్ల కోసం ఏసీ క్యాబిన్‌ను సిద్ధం చేయాలంటూ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎన్2, ఎన్3 క్యాటగిరీ వాహనాల డ్రైవర్ క్యాబిన్ తప్పనిసరిగా ఎయిర్ కండిషన్డ్ అయి ఉండాలని స్పష్టం చేసింది. ట్రక్‌లో ఏసీ క్యాబిన్‌ను తప్పనిసరి చేస్తూ జారీచేసిన ముసాయిదా నోటిఫికేషన్‌కు ఆమోదం లభించినట్టు ఈ ఏడాది జూలైలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. దేశంలోని రవాణా రంగంలో కీలకపాత్ర పోషించే ట్రక్ డ్రైవర్ల సమస్యల్ని పరిష్కరించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్న ఆయన.. వారికి మెరుగైన పని వాతావరణం కల్పించడం ద్వారా సామర్థ్యాన్ని పెంచవచ్చని పేర్కొన్నారు. త్వరలోనే ఎయిర్ కండిషన్డ్ క్యాబిన్‌ను తప్పనసరి చేయబోతున్నట్టు అప్పుడే చెప్పారు. ఇప్పుడు ఈ విషయంలో కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

## మహిళలపై యాసిడ్ దాడుల్లో బెంగళూరు టాప్

బెంగళూరు: దేశంలోని మెట్రో పాలిటన్ సిటీల్లో మహిళలపై యాసిడ్ దాడులు ఆందోళనకు గురి చేస్తున్నాయి. 2022లో 19 మెట్రో పాలిటన్ నగరాల్లో నమోదైన కేసులను జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) తాజా నివేదిక వెల్లడించింది. 8 కేసులతో బెంగళూరు ఈ జాబితాలో మొదటి స్థానంలో నిలిచింది. ఢిల్లీ రెండో స్థానంలోనూ, అహ్మదాబాద్ మూడో స్థానంలో ఉన్నాయి.

**2022లో మహిళలపై యాసిడ్ దాడులు**

| నగరం | సంఖ్య |
|---|---|
| బెంగళూరు | 8 |
| ఢిల్లీ | 7 |
| అహ్మదాబాద్ | 5 |



# న్యాయవిద్య చదివి.. తన కేసు తానే వాదించుకుని!

## చేయని నేరానికి రెండేండ్ల జైలు

### బెయిల్‌పై బయటకు వచ్చి న్యాయవిద్య అభ్యసన

### తన కేసు తానే వాదించుకుని నిర్దోషిగా బయటకు

### ఉత్తరప్రదేశ్ యువకుడు అమిత్ చౌదరి స్ఫూర్తి గాథ

*మీరట్, డిసెంబర్ 10:* చేయని నేరానికి రెండేండ్ల జైలు.. తలకిందులైన జీవితం.. చెల్లాచెదురైన కలలు.. అయినా కుంగిపోలేదు.. ఆశను వీడలేదు.. నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని బలంగా నిశ్చయించుకున్నాడు.. సంక్షోభాన్ని అవకాశంగా మలచుకున్నాడు.. తన కేసును తానే వాదించుకోవాలని నిర్ణయించుకున్నాడు.. బెయిల్‌పై బయటకు వచ్చి పట్టుదలతో న్యాయవిద్యను అభ్యసించాడు.. కేసును వాదించి గెలిచాడు.. నిర్దోషిగా బయటకు వచ్చాడు.. ఇదీ ఉత్తరప్రదేశ్‌కు చెందిన అమిత్ చౌదరి స్ఫూర్తిగాథ.

**అంధకారం అలుముకున్నా..**

చేయని నేరానికి ఎవరైనా శిక్ష అనుభవించాల్సి వస్తే ఆ బాధ వర్ణనాతీతం. చాలా మంది మానసికంగా కుంగిపోతారు. సాధారణ జీవితాన్ని గడపలేని స్థితికి చేరుకుంటారు. కానీ, అమిత్ చౌదరి ఇందుకు భిన్నం. *2011*లో ఆయన *18* ఏండ్ల వయసులో ఉన్నప్పుడు చేయని ఓ నేరంలో నిందితుడిగా ఇరుక్కున్నాడు. మీరట్‌లో ఇద్దరు కానిస్టేబుళ్ల హత్యకు సంబంధించిన కేసులో నాటి ముఖ్యమంత్రి మాయావతి ఆదేశాల మేరకు భారత శిక్షా స్మృతి (ఐపీసీ) తోపాటు జాతీయ భద్రతా చట్టం కింద పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. అంతటితో ఆగకుండా ఆయనపై గ్యాంగ్‌స్టర్ ముద్ర కూడా వేయడంతో జైలులో రెండేండ్లు ఊచలు లెక్కించాల్సి వచ్చింది. దీంతో అమిత్ చౌదరి జీవితంలో అంధకారం అలుముకున్నది. అయినప్పటికీ ఆయనేమీ కుంగిపోలేదు. న్యాయ విద్యను అభ్యసించడం ద్వారా తన కేసును తానే వాదించుకుని నిర్దోషిత్వాన్ని నిరూపించుకున్నాడు. రైతు బిడ్డ అయిన అమిత్ చౌదరిని ముజఫర్‌నగర్ జైలులో కరుడు గట్టిన గ్యాంగ్‌స్టర్లు ఎన్ని ప్రలోభాలు పెట్టారు. తమ గ్యాంగ్‌లలో చేరాలని ఒత్తిడి తెచ్చారు. అయినా ఆయన లొంగలేదు. ఈ విషయంలో జైలర్ తనకు ఎంతో సహకరించారని, గ్యాంగ్‌స్టర్లు ఉన్న బ్యారక్ నుంచి తనను వేరే బ్యారక్‌కు మార్చారని అమిత్ చౌదరి తెలిపారు.

**బెయిల్‌పై విడుదలై..**

*2013*లో బెయిల్‌పై విడుదలైన అమిత్ చౌదరి తనపై పడిన అపనిందను తొలగించుకునేందుకు న్యాయ విద్యను అభ్యసించడంలో నిమగ్నమై బీఏ, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పూర్తి చేయడంతోపాటు విద్యలో పలు మైలురాళ్లను అధిగమించాడు. తద్వారా న్యాయపరమైన అంశాల్లో పట్టు సాధించి లాయర్‌గా తన కేసును తానే వాదించుకున్నాడు. ఈ కేసులో అమిత్ చౌదరిపై మోపిన అభియోగాలను రుజువు చేయడంలో ప్రాసిక్యూషన్ విఫలమవడంతో ఆయనతో సహా *13* మందిని నిర్దోషులుగా ప్రకటిస్తూ కోర్టు ఇటీవల తీర్పు ఇచ్చింది. ఈ కేసులో అసలు నేరస్థులైన ముగ్గురిలో సుమిత్ కైల్ అనే వ్యక్తి *2013*లో ఓ ఎన్‌కౌంటర్‌లో మరణించగా.. నీతూ అనే మరో వ్యక్తికి కోర్టు జీవిత ఖైదు విధించింది. మరో నేరస్థుడు ధర్మేంద్ర ఇటీవల క్యాన్సర్‌తో మృతి చెందాడు. కాగా, ఈ కేసు వల్ల సైనిక దళంలో చేరాలన్న అమిత్ చౌదరి కలలు చెల్లాచెదురైపోయాయి. అయినప్పటికీ తన మాదిరిగా అపనిందల పాలైనవారికి అండగా నిలవాలని ఆయన నిర్ణయించుకున్నారు. అందుకోసం క్రిమినల్ జస్టిస్‌లో పీహెచ్‌డీ చేసేందుకు సిద్ధమవుతున్నాడు.